

తాగునీటి పైపులైన్ ఏర్పాటు



ప్రజాశక్తి-సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామ పరిధిలోని పలుచోట్ల తాగునీటి పైపులైన్లు పగిలి లీకేజీ అవుతుండటంతో శనివారం నూతన పివిసి పైపులు కొనుగోలు చేసి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసినట్టు సర్పంచ్ భాషా మసూద్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్, మెకానిక్ భాష తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి తలరాత మార్చేది విద్య



ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పేదవాడి తలరాతను మార్చే శక్తి విద్యకు ఉందని, విద్య సమాజంలో అంటరానితనాన్ని పోగొట్టి సమానత్వాన్ని ఏర్పరుస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖా మాత్యులు కె.నారాయణస్వామి అన్నారు. శనివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మొదటి, రెండవ, మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేదవాడి పిల్లలు కలెక్టర్లు, ఎస్‌పి లు, డాక్టర్లు, ఇంజినీర్లు వంటి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయమని తెలిపారు. కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా పేదరికాన్ని మాత్రమే అర్హతగా భావించి పేదవారి అభ్యున్నతికి ముఖ్యమంత్రి పాటుపడుతున్నారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా విద్యకు ముఖ్యమంత్రి రూ. 60,329 కోట్లు ఖర్చు పెడుతున్నారని తెలిపారు. జగనన్న ఆణిముత్యాలు పథకం ద్వారా నియోజకవర్గ పరిధిలో 10వ తరగతిలో మొదటి, రెండవ, మూడవ స్థానాలు సాధించిన విద్యార్థులకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు పురస్కారంతో పాటు మెరిట్ సర్టిఫికెట్, మెడల్, మెమెంటోతో వారి తల్లిదండ్రులను దుస్సాలువాతో సన్మానం, ఇంటర్మీడియట్‌లో మొదటి, రెండవ, మూడు బహుమతులు సాధించిన వారికి ఒక్కొక్కరికి రూ.15,000 లు, అలాగే జిల్లా స్థాయిలో పదవ తరగతిలో మొదటి బహుమతి గాను రూ50,000, రెండవ బహుమతి గాను రూ.30,000, తతీయ బహుమతి గాను రూ. 15,000, ఇంటర్మీడియట్ లో మొదటి, రెండవ, మూడవ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.50,000 లు నగదు బహుమతిగా అందిస్తూ మెరిట్ సర్టిఫికెట్, మెడల్, మెమెంటో ప్రదానం చేయడం జరుగుతుందని తెలిపారు. వీటితో పాటు నాడు-నేడు, అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, జగనన్న గోరుముద్ద, ఇంగ్లీష్ మీడియంలో విద్య వంటి కార్యక్రమాలను ప్రవేశ పెట్టారని తెలిపారు. చిత్తూరు ఎంపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆర్థికంగా ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటున్నారని తెలిపారు. పెత్తందారు వ్యవస్థను రూపుమాపాలని అందుకు విద్యకు పెద్దపీట వేస్తూ ప్రతి పేదవారి పిల్లలు చదువుకోవాలని, విద్య కొరకు ఎంతైనా ఖర్చు పెట్టడానికి తానూ ఎల్లప్పుడూ ముందుంటానని ముఖ్యమంత్రి అంటుంటారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని తమ ఊరికి, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని ఐఎఎస్, ఐపిఎస్ లు కావాలని సూచించారు. విద్యా పరంగా జిల్లాను అభివద్ధి చేయడంలో జిల్లా కలెక్టర్ ప్రధాన పాత్ర పోషిస్తారని తెలుపుతూ జిల్లాల విభజన అనంతరం చిత్తూరు జిల్లాలో నవోదయ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాల మంజూరులో భాగంగా కేంద్రీయ విద్యాలయానికి స్థలాన్ని కేటాయింపులో కలెక్టర్ చొరవను అభినందించారు. జిల్లాలోని నవోదయ పాఠశాలలను డిఇఒ తరచూ సందర్శించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, 10 వ తరగతి అనంతరం విద్యార్థులు తీసుకునే నిర్ణయం వారి భవిష్యత్తును నిర్దేశిస్తుందని తెలిపారు. 10వ తరగతి అనంతరం విద్యార్థులకు ఉన్న రెండు సంవత్సరాల కాలం వారి జీవితంలో అతి ముఖ్యమైన అంకం అని, ఇంటర్ మీడియట్ రెండు సంవత్సరాలు చాలా క్లిష్టమైన దశ అని, ఈ దశలో వచ్చే దురాలోచనలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బాహ్య ప్రపంచంతో పోటీ పడాలన్నా, జీవితాన్ని సంతోషంగా ఆస్వాదించాలన్నా తదుపరి ఉన్న 10 సంవత్సరాలు చాలా ముఖ్యమైన కాలంగా గుర్తించి పట్టుదలతో చదువు కోవాలన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో విద్యలో ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి తగిన మార్గాన్ని ఎంచుకుని, ఇతరులు ఈర్ష్య పడేలా ఎదగాలన్నారు. జగనన్న ఆణిముత్యాలు ద్వారా బహుమతి పొందిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్, నగర మేయర్, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్, ఐసిడిఎస్ రాయలసీమ జోనల్ ఛైర్మన్‌లు మాట్లాడారు. జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డీఈఓ విజయేంద్ర రావ్, సమగ్ర శిక్ష ఎ పి సి వెంకట రమణా రెడ్డి, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ డిడిలు రాజ్యలక్ష్మి, రబ్బానీ భాషా, మూర్తి, గురుకుల పాఠశాల డిసిఒ జయ భారతి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల కోసం అమలు చేస్తున్న వై ఎస్ ఆర్ పశు బీమా పథకం ను సద్విని యోగం చేసు కోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. నారాయణ స్వామి పేర్కొన్నారు. శనివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రం నందు వై.యస్.ఆర్ పశు బీమా పథకం నకు సంబంధించిన పోస్టర్స్ లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖామాత్యులు కె. నారాయణస్వామి, చిత్తూరు పార్ల మెంటు సభ్యులు ఎన్.రెడ్డప్ప, జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్ చేతుల మీదుగాఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిత్తూరు మేయర్ అముద, జడ్పీ వైస్ చైర్మన్ రమ్య, ఐ సి డి ఎస్ రాయలసీమ జోనల్ చైర్మన్ శైలజా రెడ్డి, జడ్పీ మహిళా స్థాయి సంఘ చైర్మన్ భారతి, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ప్రభాకర్, జడ్పీ సిఈఓ ప్రభాకర్ రెడ్డి, సంబంధింత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు



ఉపాధి అవకాశాలపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: హెచ్‌సిఎల్ టెక్ బి సంస్థతో జిల్లాలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ గుణశేఖర్, డిఆర్‌డిఎ పిడి తులసి, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి రాజ్యలక్ష్మి, ఆర్‌ఐఒలతో కలసి ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో హెచ్‌సిఎల్ టెక్ బి సంస్థతో జిల్లాలోని యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో హెచ్‌సిఎల్ టెక్ బి సంస్థతో జిల్లాలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. 2022-23 సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో 75% మార్కులతో పాస్ అయ్యి, మ్యాథమెటిక్స్‌లో 60 శాతం మార్కులు వచ్చిన విద్యార్థులు అర్హులని తెలిపారు. హెచ్‌సిఎల్ టెక్ బి సంస్థ ద్వారా నిర్వహించే పరీక్షలో పాస్ అయిన వారు అర్హులని తెలిపారు. ఆరు నెలలకు ఒకసారి 200 మంది యువతను ఎంపిక చేసి వారికి ఆరు నెలలు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, శిక్షణ సమయంలో ప్రతి నెలా రూ.10 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. ఆరు నెలలు శిక్షణ పూర్తి చేసిన వారు ఫుల్ టైం ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉందని, సంవత్సరానికి రూ.1.70 లక్షల నుంచి 2.20 లక్షలు పొందుతారని తెలిపారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్, డిఆర్‌డిఎ పిడి సమన్వయం చేసుకొని 1000 మంది చొప్పున యువతకు రెండు సార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనికి సంబంధించి సోమ వారం మధ్యాహ్నం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విద్యాశాఖ అధికారి, డిసిఒ, డిఆర్‌డిఎ పిడి, ఆర్‌ఐఒ, సెట్విన్ సీఈవో, డిడి సంక్షేమ శాఖ, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్లతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 21వ తేదీ జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్‌లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఈ సమావేశానికి ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ అందరూ హాజరు కావాలన్నారు. హెచ్‌సిఎల్ టెక్ బి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనపై ఈనెల 28న నాగయ్య కళాక్షేత్రంలో యువత తల్లిదండ్రులకు ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సోని సుహాని, జిల్లా పరిశ్రమల జిఎం సంజీవరాజు, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ సరిత రెడ్డి, హర్ష ఏకాంబరం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

డిఇఒకు ఎస్‌టియు వినతి



డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌టియు నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఇటీవల టీచర్ల కౌన్సిలింగ్ జరిగిన నేపథ్యంలో, జిల్లా వ్యాప్తంగా టీచర్ల జీతాల బిల్లులు, సర్వీసు అంశాల విషయంలో సమస్యలు నివారించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు జిల్లా విద్యాశాఖాధికారికి వినతి చేశారు. ఈ సందర్భంగా ఎస్‌టియు నాయకులు మాట్లాడుతూ గత బదిలీల కౌన్సిలింగ్ సమయంలో జాయినింగ్ తేదీల విషయానికి సంబంధించి జరిగిన పొరపాట్ల వలన, ప్రస్తుత బదిలీ కౌన్సిలింగ్లో చాలామంది టీచర్లు సీనియారిటీ పాయింట్ల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించారు.ప్రస్తుత బదిలీలలో టీచర్ల జాయినింగ్ తేదీలను జిల్లావ్యాప్తంగా ఒకే రకంగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. టీచర్ పోస్టుల సర్దుబాటుకు సంబంధించిన వివరాలను జిల్లాలోని అన్ని సబ్ ట్రెజరీ కార్యాలయాలకు పంపించి, ఆ వివరాలను ఆన్లైన్లో అందరికీ అందుబాటులో ఉంచాలని కోరారు. జిల్లాలో 2018 డిఎస్సీ ద్వారా ఎంపికైన పీఈటీలు ప్రస్తుతం పదోన్నతులకు కనీస సర్వీసు పూర్తి చేసుకున్నందున ,వారికి స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)గా పదోన్నతులు ఇవ్వాలని కోరారు. డీఈఓ విజయేంద్రరావు సానుకూలంగా స్పందిస్తూ, తప్పకుండా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.టి.యు నాయకులు మదన్ మోహన్ రెడ్డి, పరందామ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అపోలో శానిటేషన్ సెక్యూరిటీల...

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు ప్రభుత్వ, అపోలో ఆసుపత్రిలో గత 20 సంవత్సరాలుగా శానిటేషన్, సెక్యూరిటీ, సూపర్వైజర్లుగా పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం చిత్తూరు ప్రభుత్వ ప్రధాన వైద్యశాల మెడికల్ సూపర్డెంట్ అరుణ్ కుమార్ గారికి అపోలో ఆసుపత్రి మెడికల్ సూపర్డెంట్ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకత్వంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్. నాగరాజు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న పారిశుద్ధ్యం సెక్యూరిటీ, సూపర్వైజర్లుగా పనిచేస్తున్న వారి నెలసరి జీతాల్లో పిఎఫ్ కోసం డిటెక్టివ్ చేసిన పీఎఫ్ డబ్బుల అరియర్స్ డబ్బులను కొంతమంది సిబ్బందికి మంజూరు చేసి మరి కొంతమంది సిబ్బందికి మంజూరు చేయకపోవడం చాలా బాధాకరమన్నారు అలాగే ప్రభుత్వ ఆసుపత్రి ,అపోలో ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వ జీవో549 ప్రకారం వేతనాలుమంజూరు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, గుర్తింపు కార్డు మంజూరు చేయాలని, సూపర్వైజర్లకు యూనిఫారం మంజూరు చేయాలని అనేకసార్లు రాతపూర్వకంగా ఇచ్చినప్పటికీ సమస్య ఇప్పటిదాకా పరిష్కారం కాలేదు అధికారులు చేస్తాం, చూస్తాం, ప్రాసెస్ జరుగుతున్నదని చెప్పుతూ కాలయాపన చేస్తున్నారు తప్ప సమస్య పరిష్కారం కాలేదు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే వారం తర్వాత ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దాసరి చంద్ర, చిత్తూరు బ్రాంచ్ నాయకులు దామోదర్ రెడ్డి ,శంకరయ్య , రఘు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

సిపిఐ నాయకులు నాగరాజు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మామిడి రైతులను ఆదుకోవాలని సిపిఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిపిఐ నాయకులు నాగరాజు మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా జిల్లా కలెక్టర్‌ను కోరారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు, మామిడి పంట ఎక్కువ గా దిగుబడి కావడంతో మామిడి రైతులకు గిట్టుబాటు ధర లేక మామిడి రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మామిడి రైతులు పంటను రోడ్లు పై పారపోస్తున్నారని ఆవేదన చెందారు. బిడ్డల చూసుకొని పంట చేతికి వచ్చేసరికి రైతుకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మామిడి రైతులు అల్లాడిపోతున్నారని అన్నారు ఇలాంటి తరుణంలో ప్రభుత్వం, చిత్తూరు జిల్లా కలెక్టర్ గారు జోక్యం చేసుకొని మామిడి రైతులను ఆదుకోవాలని ,గిట్టుబాటు ధరలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఫ్యాక్టరీ యజమానులతో చర్చించి మామిడి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

30న 'నారాయణ అండ్ కో' సినిమా విడుదల

ప్రజాశక్తి - తిరుపతి సిటి

నేటి పరిస్థితుల్లో చిన్న చిత్రాన్ని పూర్తి చేయాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలు పడాలని, ఈ విషయం నారాయణ అండ్ కో చిత్రంలో చవిచూశామని నారాయణ అండ్ కో చిత్ర బందం తెలిపింది. తిరుపతి లీలామహల్ కూడలిలోని ఓ హోటల్ లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. హిరో సుధాకర్ , హీరోయిన్లు పూజ కిరణ్ , యామిని , హాస్య నటుడు జై కష్ణ , డైరెక్టర్ చిన్న పాపిశెట్టి లు మాట్లాడారు. మంచి కెమెరాతో క్వాలిటీ మిస్ కాకుండా ఫ్యామిలీ మొత్తం నవ్వుకోగలిగే సినిమా ను రూపొందించామన్నారు. ప్రముఖ దర్శకులు శేఖర్ కమ్ముల చేతుల మీదుగా ఈ చిత్ర టీజర్ ను విడుదల చేశామన్నారు. 6 నుంచి 60 సంవత్సరాల వయసు కలిగిన ప్రతి ఒక్కరూ చూసే చిత్రమన్నారు. ప్రేక్షకులంతా చిత్రాన్ని ఆదరించాలని కోరారు. ఈనెల 30వ తేదీ విడుదల కానున్న ఈ చిత్రంలో సీనియర్ నటులు సప్తగిరి , ఆమని , దేవి ప్రసాద్ తదితరులు నటించారన్నారు. ఇదివరకే ఓ సాంగ్ ని రిలీజ్ చేశామని. అది ప్రేక్షకుల ఆదరణ పొందిందన్నారు. ఒక్కో పాటను వేరువేరు మ్యూజిక్ డైరెక్టర్ లతో రూపొందించామన్నారు. ఈ చిత్రంపై తాము ఆశలు పెట్టుకుని ఉన్నామని, తమ చిత్ర టీంను ఆశీర్వదించాలని కోరారు.



మీడియాతో చిత్ర యూనిట్

19న క్రిస్టియన్ మైనారిటీల సమావేశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న క్రిష్టియన్ మైనారిటీ జిల్లా నాయకులు జాష్వ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఈనెల 19వ తేది స్థానిక అంబేద్కర్ భవన్‌లో క్రిష్టియన్ మైనారిటీల సమావేశం నిర్వహిస్తున్నట్లు క్రిష్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షులు జాష్వ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రిష్టియన్ మైనారిటీ నాయకులు ప్రసాద్, జాష్వ మాట్లాడుతూ జిల్లాలోని క్రిష్టియన్‌ల సమస్యల పరిష్కరం, పేద క్రిష్టియన్లను ఆదుకొని సంక్షేమ పథకాలను అమలు చేసేలా తమ కార్యచరణ ఉంటుందని తెలిపారు. 19వ తేది నిర్వహించే సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు జాన్‌సన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రిష్టయన్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇళ్ల నిర్మాణాలపై అలసత్వం వద్దు



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి అర్బన్ నివాసితులకు కేటాయించిన జగనన్న ఇంటి నిర్మాణాలపై అలసత్వం వద్దని అధికారులకు, కాంట్రాక్టర్లకు తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఐఏఎస్ సూచించారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం మునిసిపల్ ఇంజనీర్లు, హౌసింగ్, రెవెన్యూ, ప్లానింగ్ అధికారులు, లే అవుట్ల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లతో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ ఇప్పటికే అన్ని సమావేశాల్లోను జూలై నెలలో గహ ప్రవేశాలకు జగనన్న ఇళ్ళ నిర్మాణాలను నిర్దేసించిన లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని స్పష్టంగా తెలియజేసిన ఇంత వరకు అనుకున్న మేరకు లక్ష్యలను చేరుకోకపోవడం అధికారుల పర్యవేక్షణ లోపంగాను, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంగాను పరిగణించాల్సి వస్తుందన్నారు. తిరుపతి నగరంలోని అర్హులైన ప్రజలకు చిందేపల్లి, జీపాళెం, కల్లూరు, ఎం.కొత్తపల్లి, సూరప్పకశం, టిసి.అగ్రహారం ప్రాంతాల్లో నిర్మిస్తున్న జగనన్న ఇళ్ళను లే అవుట్ల వారిగా చర్చిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మిస్తున్న జగన్న నిర్మాణాలను వేగవంతం చేయాలని, ప్రతి ఒక్క కాంట్రాక్టర్ జూలై 17 కల్లా తమకిచ్చిన లక్ష్యాల మేరకు ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయవల్సిందేనని కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకొని లే అవుట్లపై నిరంతరం పర్యవేక్షణ వుండాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, హౌసింగ్ పి.డి వెంకటేష్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మ, ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఏనుగుల సంరక్షణ ఏది?

ప్రజా'దృష్టి'


జిల్లావ్యాప్తంగా ఏనుగుల దినదిన గండాయుషుగా కాలం వెలదీస్తున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టం ఇక్కడ చట్టబండలుగా మారిపోయింది. బుధవారం రాత్రి పలమనేరు సమీపంలో మూడు ఏనుగులు రోడ్డు ప్రమాదంలో చనిపోవడం జంతు ప్రేమికులను తీవ్రంగా కల్చివేసింది. జాతీయ రహదారుల వద్ద ఏనుగులకు అండర్ బ్రిడ్జిలు, రైలింగ్, సోలార్ కంచె ఏర్పాటు చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఆ పని చేసి ఉంటే బుధవారం రాత్రి మూడు ఏనుగులు మత్యువాత పడేవి కావు. ఏదేమైనా ప్రభుత్వం మాత్రం ఏనుగుల సంరక్షణ విషయంలో చేష్టలుడిగి చోద్యం చూస్తున్నది. రైతులు పంట విషయంలోనూ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుంది. 25 సంవత్సరాల క్రితం కేరళ మధుమలై అడవుల నుంచి ఇటువైపు ఏనుగులు వలస వచ్చాయి. అప్పట్లో అక్కడ ఏనుగుల దంతాలు స్మగ్లర్లు దాటికి తట్టుకోలేక ఇక్కడ వున్న అడవి సురక్షితమని మకాం మార్చాయి. అప్పటి నుంచి పలమనేరు, కుప్పం, పెద్ద ఉప్పరపల్లి అడవులతో పాటు సమీపంలోని తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి, కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా సరిహ ద్దుల్లోని అడవులలో ఏనుగులు సంచరిస్తున్నాయి. మొదట 42 ఏనుగులు ఈ ప్రాంతానికి రాగా మెల్లగా అవి సంతతి పెంచుకున్నాయి. ప్రస్తుతం 110 వరకు ఉన్నాయని అంచనా. కౌండిన్య శాంచురీలి పేరట వన్య ప్రాణ సంరక్షణ పథకాన్ని ప్రభుత్వం తీసుకు వచ్చింది. దీనిని పూర్తిగా విస్మరించింది. ఏనుగులకు అడవిలో ఆహారం సమకూర్చలేకపోతుంది. దాంతో



అవి రైతులు పండించిన పంట పొలాలపై పడి రైతులకు నష్టం చేకూరుస్తున్నాయి. ఈ మధ్యకాలంలో కుప్పం, పలమ నేరు, సోమల మండలాల్లో రైతులు పండించిన పంటలను ఏనుగులు నాశనం చేశాయి. మనుషులపై దాడి చేసి చంపేశాయి. దీంతో అన్నదాతలు అల్లాడిపోతున్నారు. పంటను కాపాడుకోవడానికి రైతులు కరెంటు తీగలను పంట చుట్టూ ఏర్పాటు చేశారు. కరెంటు షాక్‌కు గురై రెండు ఏనుగులు చనిపోయినా వివిధ కారణాలతో ఆరు ఏను గులు మత్యువాత పడ్డాయి. దీంతో క్రమంగా తమ జాతిని కోల్పోతున్నాయి. ఏనుగులను అడవి నుంచి పంట పొలాల మీదకు రాకుండా చేయడానికి చేపట్టిన కంచె నిర్మాణం అర్ధాంతరంగా ఆగింది. పలమనేరు నుంచి కుప్పం వరకు 70 కిలోమీటర్ల దూరం నిర్మాణం చేపట్టాల్సిన సోలార్ కంచె మధ్యలో అక్కడక్కడ బండలు, కుంటలు రావడంతో నిలిచిపోయింది. ఏనుగులు వాటి పైనుంచి గ్రామాల్లోకి వస్తున్నాయి. సోలార్ బ్యాటరీలు నాసిరకంగా ఉండటంతో అవి పాడ య్యాయి. ప్రభుత్వం నుంచి నిధులు సమకూర్చు లేకపోవడంతో పెండింగ్లో ఉన్న 20 కిలోమీటర్ల కంచె నిర్మాణం పూర్తి చేయలేకపోయారు. దాంతో జిల్లాలో ఏనుగుల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. కౌండిన్య శాంచురీ పథకం ప్రభుత్వ ప్రతిపాదనలో ఉంది. దాన్ని పూర్తి చేయడానికి ఎలాంటి ప్రయత్నాలు మొదలు కాలేదు. ఏనుగులు గ్రామాల్లో రాకుండా చేసేలా అడవుల్లోనే వాటికి ఆహారం సమకూర్చడానికి అలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కంచె నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం సహకారం కోరామని అధికారులు చెబుతున్నారు. మరి అది ఎందుకు ఆమోదం కాలేదనేది అర్థం కాని పరిస్థితి. ఇప్పటికైనా ఏనుగులు ప్రమాదాల్లో మతి చెందకుండా చర్యలు తీసుకొని ఏనుగులను కాపాడాలని అదే సందర్భంలో రైతులు పంటను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వి.జి.ఆర్

సీఎం జగన్‌ది పేదల ప్రభుత్వం



ప్రజాశక్తి-పాలసముద్రం: రాష్ట్ర సీఎం జగన్మోహన్ రెడ్డిది పేదల ప్రభుత్వం అని, చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ధనవంతుల ప్రభుత్వమని డిప్యూటీ సీఎం కె నారాయణస్వామి విమర్శించారు. శనివారం శ్రీ కావ్య రాజపురం గ్రామ సచివాలయం పరిధిలోని మిట్ట దళితవాడ, ఎస్‌కె ఆర్ పురం దళితవాడ, అయ్యప్ప రాజకండ్రిగ, ఏటుకూరు పల్లె, ఆంధ్ర వాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సింగిల్ విండో అధ్యక్షులు గాలి జ్యోతి, సర్పంచ్ కాళీ మహేష్ బాబు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె నారాయణ స్వామి మండల స్థాయి అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీసి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. పేద ప్రజలు ఆర్థికంగా ఎదగాలంటే విద్య ముఖ్యమని, నాడు నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. పాఠశాల తెరవక ముందే ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్, యూనిఫామ్, బ్యాగ్, బెల్టు, బూట్లు అందించారు, ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను పంపిస్తున్న తల్లిదండ్రులకు అమ్మఒడి పథకంలో రూ.15 వేలు జమ చేస్తున్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ఇంటిముంగిటే సంక్షేమ పథకాలు అందే విధంగా వాలంటీర్ వ్యవస్థను తీసుకు వచ్చారని తెలిపారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఇస్తున్న సంక్షేమ పథకాలను ఇదేమి కర్మ అంటున్నాడు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు అన్నగళం, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసి రామ్ యాదవ్, పిహెచ్‌సి కమిటీ ఛైర్మన్ శివ ప్రకాష్ రాజు, భరోసా ఛైర్మన్ పోలయ్య, తహశీల్దార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ



ప్రజాశక్తి-సోమల: మండలంలోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును ఈనెల 30 తేదీ వరకు పంపిణీ చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని యజమానులు గుర్తించి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును తాపించాలని వైద్యాధికారిణి చందన ప్రియ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువులు, కుంటల వద్ద గొర్రెలు, మేకలు మేత తినడంతో కడుపులో పలు రకాల పురుగులు పెరిగి జీవాలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, దీంతో గొర్రెలు, మేకల ఎదుగుదల కూడా ఆగిపోతుందని, ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయనున్న నట్టల నివారణ మందును ప్రతి ఒక్కరూ తమ జీవాలకు తాపించి వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

పౌష్టికాహారం...



ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సదుం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పలువురు కుష్టు వ్యాధిగ్రస్తులకు దాతల సహకారంతో అదనపు పౌష్టికాహారాన్ని వైద్యులు, దాతలు పంపిణీ చేశారు. శనివారం మార్తూరి వారి పల్లెకు చెందిన ఎం నరసింహారెడ్డి, ఊర్మిలమ్మ దంపతుల ఆర్థిక సహాయంతో పౌష్టికాహారాన్ని కొనుగోలు చేసి పంపిణీ చేసినట్టు వైద్యాధికారిని గిరీష తెలిపారు. కుష్టు వ్యాధిని గుర్తించిన వెంటనే క్రమం తప్పకుండా మందులు వాడితే జబ్బు నయమయ్యే అవకాశం ఉందని వైద్యులు సూచించారు. 16 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు అదనపు పోషకాహారాన్ని వారు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు అన్నపూర్ణ, భార్గవి, సోమేశ్వర్, పర్యవేక్షక సిబ్బంది లక్ష్మీపతి, ఉదయ భాస్కర్, నీలకంఠ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హైస్కూల్ అభివృద్ధికి దాత సాయం



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: కాళేపల్లి హైస్కూల్ అభివృద్ధికి ముందుకొచ్చిన దాత మాధవరెడ్డి దాతత్వం ఎంతో భేష్ అని ఎంపీడీవో శ్రీదేవి, పంచాయతీరాజ్ డీఈ దయాకర్ రెడ్డిలు శనివారం అన్నారు. చెన్నైలో స్థిరపడ్డ కాలేపల్లి వాసి దాత మాధవరెడ్డి జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డిని కలిసి జన్మభూమిలోని హైస్కూల్లో కంప్యూటర్ ల్యాబ్, సైకిల్ స్టాండ్, కాంపౌండ్ వాల్ పెన్సింగ్ అభివద్ధికి సుమారు రూ.కోటి నిధులను తమ ట్రస్ట్ ద్వారా ఖర్చు పెట్టడానికి అనుమతి కోరారు. జడ్పిసిఇఒ ఆదేశాల మేరకు ఎంపీడీవో, పంచాయతి రాజ్ డీఈలు కలిసి కాలేపల్లి హైస్కూల్లో పలుచోట్ల స్థలాలను పరిశీలించారు. మాధవరెడ్డి దాతత్వాన్ని అధికారులు ప్రత్యేకంగా కొనియాడారు. కార్యక్రమంలో హెచ్.ఎం.కేశవరెడ్డి, ఇఒపిఆర్‌డి శివయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతలపట్టెడలో 'జనభాగీదారి'



ప్రజాశక్తి-నగరి: మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడ దళితవాడలో సీడీపీవో కృష్ణవేణి, అధికారులు శనివారం జనభాగీదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీలో ప్రీస్కూలు ద్వారా జరిపే వివిధ కార్యక్రమాలపై ఆమె అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆట, పాట, మాట, కథ, సంసిద్ధత, సజనాత్మ కథ, లోపలి, బయట ఆటలు తదితర కార్యక్రమాలతో 3 నుంచి 5 సంవత్సరాల లోపు విద్యార్థుల సమగ్ర అభివద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శంకరమ్మ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లులు, అంగన్‌వాడీలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం



ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో టీటీడీ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో విధులు నిర్వహిస్తున్న టీటీడీ ఉద్యోగులు పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయాలనే ఔదార్యం కలిగిన దాతలు ముందుకొచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకొని తమ దాతత్వాన్ని చాటుకోవాలని కోరారు. టీటీడీ ప్రారంభించిన అన్నదాన కార్యక్రమాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు. కార్యక్రమంలో టీటీడీ ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి అద్దాల పంపిణీ



ప్రజాశక్తి-నగరి: ఆర్కేరోజా ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఇటీవల 9 రోజులు నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరంలో 370 మందికి ఉచితంగా ఆపరేషన్ చేయడం జరిగింది. అలా అపరేషన్‌లు చేసుకొని వారి సూచనల మేరకు మందులు వాడుకుంటూ వచ్చిన వారిలో 150 మందికి శనివారం ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి భర్త, పెఫ్సీ, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి ముఖ్యఅతిథిగా పాల్గొని అందరికీ కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఆర్కేరోజా తన ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. అందులో వయోవద్ధులకు కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించిన ఈ కార్యక్రమం ఎంతో సంతప్తి ఇచ్చినట్లు ఆమె పలుమార్లు పేర్కొన్నారన్నారు. కంటిచూపు సక్రమంగా లేక వయోవద్ధాప్యంలో ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితిలో ఉన్న పలువురికి రూ.2 లక్షల మేర ఖర్చయ్యే ఆపరేషన్ ఉచితంగా చేయించి నేడు ఉచితంగా కంటి అద్దాలు ఇస్తున్నామన్నారు. సరిగా కనిపించకుండా పోయిన ప్రపంచాన్ని వారు నేడు మళ్లీ కొత్తగా చూస్తున్నారని వారి కంటిచూపుకు పునర్జన్మనిచ్చిన ఘనత మంత్రి రోజాకు, ఆమె మాటపై గౌరవంతో దూరాన్ని లెక్కచేయక ఇక్కడకు విచ్చేసి ఆపరేషన్లు చేసిన శంకరనేత్రాలయాకే దక్కుతుందన్నారు. శంకరనేత్రాలయ నిర్వాహకులకు, వైద్యబందానికి సభాముఖంగా కతజ్ఞతలు తెలిపారు. అద్దాలు తీసుకోవడానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ భోజనం పెట్టి వారు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించి, వాడాల్సిన మందులను అందజేసి ఇళ్లకు పంపించారు. కార్యక్రమంలో నగరి, పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, వైస్ ఛైర్మన్లు బాలన్, శంకర్, వైస్ ఎంపీపీ డిల్లీబాబు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాశక్తి-కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల తహశీల్దార్ రవికుమార్ రాజు అన్నారు. శనివారం కొల్లాగుంట పంచాయతీలో చేపట్టిన రీసర్వే రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకుని తమ ఆస్తిని పదిలంగా ఉంచుకోవాలన్నారు. రీసర్వే చేయడంతో గ్రామాల్లో తమ ఆస్తులను సులభంగా గుర్తించి పక్కాగా రికార్డు చేసుకోవచ్చన్నారు. అదే విధంగా వివాదాల్లోని భూములకు రీసర్వే ఒక పరిష్కార మార్గమని చెప్పారు. భూ సర్వే అనంతరం యజమానికి హక్కు ధ్రువీకరణ పత్రాన్ని అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టి మొట్టమొదటగా కొల్లాగుంట గ్రామానికి విచ్చేసిన తహశీల్దార్‌ను సర్పంచ్ దివ్య, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మునికష్ణ, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ సుబ్రమణ్యం, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ సుగుణమ్మ, వైసీపీ నాయకుడు గాంధీ శాలువాలు కప్పి, గజమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శులు వాసు, లోకేష్, వీఆర్వో గుణ పాల్గొన్నారు.

ఘనంగా సునీల్ రాజ్ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-కుప్పం: కుప్పం ఇంజినీర్ కళాశాలలో వైస్ ఛైర్మన్ సునీల్ రాజ్ జన్మదిన వేడుకలను శనివారం కళాశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిసిఎన్ సంస్థల అధినేత బిసి నాగ రాజు, సిఇఒ సాగర్ రాజ్ పాల్గొన్నారు. అనంతరం సునీల్ రాజ్‌కి కళాశాల అధ్యాపక బందం సన్మానించి, కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సునీల్ రాజ్ జన్మదిన పురస్కరించుకొని ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నగదు బహుమతి, స్టడీ మెటీరియల్స్ అందించారు. అదేవిధంగా శెట్టిపల్లిలోని విక్టరీ డెఫ్ అండ్ డంబ్ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ బాబు, కుప్పం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి, కుప్పం నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ విమల, కుప్పం లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పెట్రోల్ పోసి తగలబెట్టిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: యువకుడిపై పెట్రోల్ పోసి తగలబెట్టిన దుర్మార్గుడిని కఠినంగా శిక్షించాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి బుస నాగరాజు గౌడ్ శనివారం పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం రాజోలు ఉప్పాలవారి పాలెంలో బిసి గౌడ ఆడబిడ్డను వేధిస్తున్న అగ్రకులాలకు చెందిన వారు ఆమెపై దాడిచేసి అవమానపరిస్తే వారిని ఎదురించిన బాధితురాలు తమ్ముడు 10వతరగతి చదువుతున్న అమరనాథ్ గౌడ్‌ను కిరాతకంగా హింసించి అతనిపై పెట్రోల్ పోసి కాల్చిచంపడానికి ప్రయత్నం చేసినవారిని ప్రభుత్వం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని తమ్మినాయుని పల్లి పంచాయతీ పేగలవారిపల్లి గ్రామంలోని అమతేశ్వర స్వామి ఆలయ అభివద్ధికి రూ.2 లక్షలు మంత్రి నిధులను విరాళంగా అందజేసినట్టు సర్పంచి సురేంద్ర రెడ్డి శనివారం తెలిపారు. అలాగే పేగలవారి పల్లె గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ.5 లక్షలతో నూతన బోరు వేసేందుకు జడ్పీ నిధులు మంజూరైనట్టు సర్పంచ్ తెలిపారు.

నేడు జరిగే ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మామిడి ధర పెంచాలని చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు శనివారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం మండల కేంద్రంలోని మామిడి మార్కెట్ యార్డ్ వద్ద రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మామిడి ధర పెంచాలని ధర్నా చేపడతామని నియోజకవర్గంలోని మామిడి రైతులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు నగదు పంపిణీ

ప్రజాశక్తి-సోమల: జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన సదుం గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సష్టించారు. జిల్లాస్థాయిలో పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించి ఒకే పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికై చిత్తూరు కళాక్షేత్రంలో కలెక్టర్ సగిలి షన్మోహన్, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప చేతులమీదుగా నగదు పురస్కారాలు అందుకున్నారు. విద్యార్థులు రాకేష్ యాదవ్, హరీష్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ఒక్కొక్కరు రూ.50 వేలు, రితిక్ సాయి ద్వితీయ స్థానంతో రూ.30 వేలు, రంజిత్ కుమార్ తతీయ స్థానంతో రూ.15 వేల నగదు పురస్కారాలను అందుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహాయ సహకారాలతో గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్య అందించడం జరుగుతోందని ఈ ఘనత మంత్రి పెద్దిరెడ్డికి చెందుతుందని అన్నారు. కళాశాల సిబ్బంది కషి ఎంతో ఉందని వారికి కూడా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం శనివారం గాండ్ల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మేలిపాటి పురుషోత్తం చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో తల్లి దండ్రుల కమిటీ ఛైర్మన్ జి.ఉమాపతి, ఎంపీటీసీ కొత్తపల్లి భాస్కర్, శేషాచలపతిరెడ్డి, రామ్మూర్తి, హెచ్ ఎం చంద్ర నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని కమ్మనపల్లి ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో 2023వ సం. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సంపాదించి వరుసగా మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎస్ శాలిని 582, పూజిత 582, ఎం మైత్రి 580 లను శనివారం ఆణిముత్యాలుగా నిలిచిన వారికి ఎంఈఓ సాయి లీల మెడల్స్, సర్టిఫికెట్, నగదును అందించారు. మొదటి బహుమతికి రూ.3 వేలు, రెండో బహుమతికి రూ. 2 వేలు, మూడో బహుమతికి రూ.వెయ్యి చొప్పున అందించారు. అనంతరం కళాతరంగిని వ్యవస్థాపకులు రాజేష్ బాబు విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శోభ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: విద్యకు పేదరికం అడ్డుకాకూడదని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యంరాజు అన్నారు. శనివారం ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం సీఈసీ గ్రూపులో ప్రతిభ కనబరిచి ఆణిముత్యాన్ని అందుకున్న స్వాతిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టి పెరిగి చదువులో రాణించి ఉత్తమ మార్కులు సాధించడంతో ప్రభుత్వం అందించిన ప్రోత్సాహక నగదు బహుమతిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి చేతులు మీదుగా అందుకుని తమ కళాశాల పేరు ప్రతిష్టను నిలబెట్టిందన్నారు. అలాంటి విద్యార్థులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని రానున్న విద్యాసంవత్సరానికి ఆణిముత్యాలుగా ప్రతిభా అవార్డును అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



9న కళామందిరం వార్షికోత్సవ పోటీలు



ప్రజాశక్తి-పలమనేరు: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నిర్మించిన కళామందిరం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వివిధరకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7 నుంచి 10వ తరగతుల విద్యార్థులు "తెలుగు భాషా రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు' అనే అంశంపై రెండు పేజీలకు మించకుండా వ్యాసం రాసి పంపాలన్నారు. 1 నుంచి 6వ తరగతుల విద్యార్థులు తెలుగువారి సంస్కతి ప్రతిబింబించే విధంగా చిత్రలేఖనం గీసి పంపించాలన్నారు. ఏ తరగతి వారయినా వందకు పైగా పద్యాలు చెప్పగలిగే పిల్లలు తమ పేర్లను 9346 249011 కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు. పి.తులసినాథం నాయుడు, కళామందిరం, సాయి గార్డెన్ సిటీ, గంగవరం, పలమనేరు చిరునామాకు ఈ నెల 30వ తేదీ లోపు చేరేలా ప్రభుత్వ తపాలాలో మాత్రమే పంపాలన్నారు. జూలై 9వ తేదీన నిర్వహించబోయే ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఒక్కో విభాగం నుంచి 10 మందికి బహుమతులు అందిస్తామన్నారు

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సదుం సమీపంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరం బైపిసి, ఎంపిసి గ్రూపులలో చేరగోరు విద్యార్థుల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి శనివారం తెలిపారు. ఎంపిసి 20, బైపిసి 20 సీట్లు మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు, దీనికి అన్ని ధ్రువపత్రాలతో పూర్తిచేసిన దరఖాస్తును కళాశాలలోని కార్యాలయంలో సమర్పించి, మరిన్ని వివరాలకు కళాశాల సిబ్బందిని సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం



ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులపల్లె గ్రామ సచివాలయంలో నూతన ఆధార్ కేంద్రాన్ని తహశీల్దార్ శ్యాం ప్రసాద్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు ఆధార్ తీసుకోని వారు, నూతన ఆధార్ కార్డు తీసుకునే అవకాశం, మార్పులు, చేర్పులు, చిరునామా మార్పు, వయసు మార్పు, ఈ కేవైసీ తదితర సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మణికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి శనివారం అన్నదానం



ప్రజాశక్తి-నగరి: పట్టణ పరిధిలో టీటీడీ అనుబంధంలోని కరియమాణిక్య స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని డిప్యూటీ ఈవో నాగరత్నమ్మ శనివారం ప్రారంభించారు. టీటీడీ ఆదేశాల మేరకు ఇకపై ప్రతి శనివారం ఆలయంలో అన్నదాన కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా నగరి పట్టణానికి చెందిన ఆనం సురేష్ ఆలయంలో అన్నదానం చేశారు. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందురోజు పేరు నమోదు చేసుకోవాలని డిప్యూటీ ఈవో తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఏకాంబరం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రజాశక్తి-వెదురుకుప్పం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. గత మంగళవారం రాత్రి వెదురుకుప్పం మండలం దేవళంపేట దగ్గర కారు, బైక్ ఢీకొని ద్విచక్ర వాహనంలో వెళుతున్న తిరుమలయ్య పల్లి పంచాయతీ పెద్దబైలుకి చెందిన ఇరగం రెడ్డి, సుందరాంగిన పల్లి ధనుంజయలకు గాయాలైనట్లు తెలిసింది. కారు బైకును ఢీకొట్టిన తరువాత సంఘటన స్థలం నుంచి కారు వెళ్లిపోగా శుక్రవారం సిసి కెమెరాలలో గుర్తించామని బాధితులు తెలిపారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఢీ కొట్టిన వ్యక్తి పోలీస్ శాఖకు చెందిన వ్యక్తి అని సమాచారం. కొత్తపల్లి మిట్ట గ్రామానికి చెందిన అతను రామచంద్రాపురం పరిధిలో విధులు నిర్వహిస్తున్నారని తెలిసింది. బాధితులు ఆయన దగ్గరకు వెళ్ళి న్యాయం చేయాలని కోరగా తప్పు పూర్తిగా మీదే అని ఎదురు తిరగడం జరిగింది. సంఘటన జరిగిన మరుసటి రోజు బుధవారం ఉదయం బాధితులు వెదురుకుప్పం మండలం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారని సమాచారం. ఇప్పటికీ పురోగతి లేదని బాధితులు వాపోతున్నారు. రక్షించాల్సిన రక్షకభటులే ఇలా ఎదురు తిరిగి మాట్లాడడం విడ్డూరంగా ఉందని వారు తెలిపారు. కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే చొరవ తీసుకొని వారికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

లారీ, కారు ఢీకొని ఒకరికి...

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: లారీ, కారు ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ నాగరాజు రావు కథనం మేరకు వివరాలు.. మండలంలోని నలగం పల్లి గ్రామంలో చిత్తూరు నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు, ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి లారీ వెనక భాగంలో ఢీకొంది. ఈ సంఘటనలో బెంగళూరుకు చెందిన నరేష్ కుమార్‌కు గాయాలు అవ్వడంతో 108లో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు తెలిపారు.

ఇల్లు దగ్ధం



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని ఎఎం పురం గ్రామపంచాయతీ రాఘవ రాజాపురం దళితవాడకు చెందిన చిన్న కుమారుడు చిట్టిబాబు పెంకిటిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. చిట్టిబాబు భార్య పొట్టమ్మ, ముగ్గురు పిల్లలు కలిసి ఆ ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇంట్లో 10 వరి బస్తాలు, వేరుశనగ 8 బస్తాలు, సుమారు రూ.1.50 లక్షల విలువైన ఇంటి నిర్మాణానికి టేక్ కొయ్యలు దగ్ధమైనట్టు తెలిపారు. స్థానికులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నం చేసేలోపే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. అనంతరం ఆ ఇంటిని మండల తహశీల్దార్ జయప్రకాష్ సందర్శించి బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

మాతా, శిశుమరణాలు తగ్గించండి



ప్రజాశక్తి-యాదమరి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలను 100 శాతం అందజేయాలని సిహెచ్ఒ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 70 కొత్తపల్లి గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిహెచ్ఒ మాట్లాడుతూ మాతా శిశుమరణాలను పూర్తిగా నిర్మూలించేందుకే ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. గర్భిణులు, 5 సంవత్సరాలలోపు చిన్నారులు అందరికీ వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరిగేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేసుకోవడంతో కాన్పు సమయంలో తల్లికి, జన్మించిన శిశువుకు గానీ ఏదైనా ఇబ్బంది ఎదురైతే నిష్ణాతులైన వైద్యులు అందుబాటులో ఉంటారు కనుక వారికి ఎలాంటి ప్రాణహాని లేకుండా సురక్షితంగా కాపాడుతారని వివరించారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్త గజలక్ష్మి, ఆశా కార్యకర్త సునీత, గ్రామస్తులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.